W W W.EPAPER.MAHADAILY.COM
మహా పత్రిక
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
5-8-2025

04



## డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి సాధ్యం

బీజేపీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్ రావు

డబుల్ ఇంజన్ సర్కార్ తోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్ రావు పేర్కొన్నారు. మండలంలోని పైనంపల్లి, నేలకొండపల్లి లో సోమవారం ఇంటింటి బీజేపీ కార్యక్రమం ను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు.

02



# కల్లూరు ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

## 30 మంది గిరిజన బాలికల అస్వస్థత

- కిచిడీ తిన్న క్షణాల్లో కలకలం
- వాంతులు కడుపునొప్పితో విలవిలలాడుతున్న విద్యార్థులు
- విషపూరిత కిచిడీపై తల్లిదండ్రుల ఆవేదన
- మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశం

ఖమ్మం, మహా

ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం ఉదయం హఠాత్ కలకలం చోటుచేసుకుంది. టిఫిన్ సమయంలో అందరికీ వడ్డించిన కిచిడీ తినగానే, సుమారు 30 మంది బాలికలు తీవ్ర అస్వస్థతకు గురై కడుపునొప్పి, వాంతులు, తలనొప్పులతో విలవిల్లాడారు. ఇంకా 50 మంది విద్యార్థినులకు స్వల్పంగా లక్షణాలు కనిపిస్తున్నట్లు సమాచారం.

## బొజ్జాయిగూడెం వద్ద భారీ గంజాయి పట్టివేత

మహారాష్ట్రకు తరలిస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో ముగ్గురు అరెస్ట్

06



ఇల్లెందు మండలంలోని బుజ్జాయిగూడెం వద్ద పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం కొత్తగూడెం ప్రధాన రహదారిపై వాహన తనిఖీల సందర్భంగా ఈ ఘటన వెలుగు చూసింది. ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను తెలిపిన వివరాల ప్రకారం, ఇల్లెందు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి సిబ్బందితో కలిసి బుజ్జాయిగూడెం పంచాయతీ ఆఫీస్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు.

08



## ఎస్టీ హాస్టల్ ఘటనపై మట్టా రాగమయి సీరియస్

- విద్యార్థినుల క్షేమం కోసం రంగంలోకి దిగిన ఎమ్మెల్యే
- సొంత కాన్వాయ్‌తో విద్యార్థినుల తరలింపు
- హాస్టల్ సిబ్బందిపై ప్రశ్నల వర్షం

కల్లూరు ఎస్సీ హాస్టల్ ఫుడ్ పాయిజన్ ఘటనపై సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సీరియస్ అయ్యారు. సోమవారం ఉదయం హాస్టల్లో 50 మంది విద్యార్థుల పైగా అస్వస్థ గురువు కావడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న వారు సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

# కల్లూరు ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

- 30 మంది గిరిజన బాలికల అస్వస్థత
- కిచిడీ తిన్న క్షణాల్లో కలకలం
- వాంతులు కడుపునొప్పితో విలవిలలాడుతున్న విద్యార్థులు
- విషపూరిత కిచిడీపై తల్లిదండ్రుల ఆవేదన
- మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశం









**ఖమ్మం, మహా:** ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం ఉదయం హఠాత్ కలకలం చోటుచేసుకుంది. టిఫిన్ సమయంలో అందరికీ వడ్డించిన కిచిడీ తినగానే, సుమారు 30 మంది బాలికలు తీవ్ర అస్వస్థతకు గురై కడుపునొప్పి, వాంతులు, తలనొప్పులతో విలవిల్లాడారు. ఇంకా 50 మంది విద్యార్థినులకు స్వల్పంగా లక్షణాలు కనిపిస్తున్నట్లు సమాచారం. వెంటనే అప్రమత్తమైన హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందిన వారిలో 10 మందికి పైగా బాలికల పరిస్థితి విషమంగా ఉండటంతో, ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అంబులెన్స్‌ల ద్వారా తరలించారు. ఘటన తీవ్రతతో కలెక్టర్, గిరిజన శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.

### అజయ్ యాదవ్ హాస్పటల్ పర్యటన

ఈ సంఘటనను అత్యంత సీరియస్‌గా తీసుకున్న జిల్లా అదనపు కలెక్టర్ అజయ్ యాదవ్, తక్షణమే ఆసుపత్రిని సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్య సిబ్బందికి ప్రత్యేక మార్గనిర్దేశనలిచ్చారు. హాస్టళ్లలో ఆహార నాణ్యతపై పటిష్ట పరిశీలనకు ఆదేశాలు జారీ చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

### విషపూరిత కిచిడీ అనుమానం

బాలికలకు అస్వస్థత కలిగిన ఆహారంలో ఏదైనా విషపదార్థం చేరిందా? లేదా నీటి ద్వారా వ్యాధికీటాణువులు విస్తరించాయా? అనే కోణాల్లో అధికారులు విచారణ ప్రారంభించారు. ఆరోగ్యశాఖ ఇప్పటికే కిచిడీ, బియ్యం, వంటనీరు, మసాలాలు వంటి అన్నిరకాల పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పంపింది.

### తల్లిదండ్రుల ఆవేదన చిన్నారుల జీవితం ఇలాగో సాగుతుందా?

వార్త తెలిసిన వెంటనే తల్లిదండ్రులు ఆసుపత్రికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. "పేదలకు అందుతున్న విద్యా అవకాశాలే చివరికి ప్రాణాల మీదకు వస్తాయా?" అని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్లో హైజీన్, ఆహార ప్రమాణాలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

### హాస్టల్ నిర్వహణపై విచారణ కమిటీ ఏర్పాటు

ఈ ఘటనపై రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం నుంచి విచారణ అధికారులను నియమించనుంది. హాస్టల్ వంటగదుల్లో పర్యవేక్షణ ఎలా ఉంది? వంటగాళ్లు అర్హులా? పిండిదినుసుల నిల్వలు సరైనవా? అన్నివిషయాల్లో విశ్లేషణాత్మక నివేదిక కోరినట్లు సమాచారం. ఈ ఘటన కేవలం ఒక్కరోజు ప్రమాదం కాదు %-% ఇది రాష్ట్రవ్యాప్తంగా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలలో సాగుతున్న పూర్వాపరాల అలసత్వ పాలనకి అద్దంపడే ఉదాహరణ. చిన్నారులకు ఇలాంటి ఘటనలు జీవితాంతం భయాన్ని మిగులుస్తాయి. హాస్టల్ ఆరోగ్య నిబంధనలు, ఆహార నాణ్యతపై కఠిన నియంత్రణలు లేకుండా "విద్యతో పాటు విషం" అందిస్తున్నాం అనుకోవాల్సిందే!



మహా పత్రిక
ANN తెలుగు

# సింగరేణి జేవీఆర్ఓసీలో సెక్యూరిటీ నిఘ వ్యవస్థ ప్రారంభం



**సత్తుపల్లి, ఆగస్టు 4: మహా:** తెలంగాణ రాష్ట్ర సిరుల మాగాణి సింగరేణి గా పేరుగాంచిన సంస్థకు సెక్యూరిటీ పహారా కీలకం. అత్యున్నత యంత్ర సామాగ్రి, సంస్థ కొనుగోలు చేసిన డీజిల్ ట్యాంకర్లపై పర్యవేక్షణ,బొగ్గు నిలవలకు రక్షణ వంటి కీలక అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రధాన ప్రాంతాలలో సీసీ కెమెరాలు అనుసంధానం చేస్తూ ఏర్పాటుచేసిన ఎస్ అండ్ పిసి సెక్యూరిటీ కమాండ్ కంట్రోల్ రూమ్ ను కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేం రాజు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జి.ఎం ను జే.వి.యర్ ఓ.సి సెక్యూరిటీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవరోధాలు ఎదుర్కొంటూ సంస్థ ఆస్తుల పరిరక్షణలో భద్రత శాఖ పనిచేస్తున్న తీరును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఏ.జి.ఎం సిహెచ్ రామకృష్ణ, జే.వి.ఆర్ ఓ.సి ప్రాజెక్ట్ ఆఫీసర్ వి.ఆర్ ప్రహ్లాద్, కిష్టారం ఓ.సి ప్రాజెక్ట్ ఆఫీసర్ నరసింహారావు, పి.ఈ.డి శ్రీనివాసరావు, సోమశేఖర్, ఎస్.ఓ.ఎం రాజేశ్వరరావు, వెల్ఫేర్ దేవదాసు, సివిల్ ఎస్.ఈ రవికుమార్, ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ రజాక్, ఏ.ఐ.టీ.యూ.సీ ఫిట్ సెక్రెటరీ నరసింహారావు,ఫిట్ సెక్రెటరీ రామారావు,యాక్టింగ్ జూనియర్ ఇన్స్పెక్టర్ బందెల విజేందర్ జమేదార్ మల్లేష్, యాక్టింగ్ జమేదార్ కే.వెంకటేష్, సీనియర్ సెక్యూరిటీ జోసెఫ్, కనకయ్య, షద్రక్ బాబు, కే.ఎస్.వి.వి సత్యనారాయణ, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం క్రైమ్, మహా:** ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. సోమవారం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ గారు స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు,.%జజుచీూ% అప్లోడ్, జనరల్ డైరీ రికార్డులను పరిసరాలను పరిశీలించారు. పిటిషన్ విచారణలకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, సస్పెక్ట్ షీట్‌లు, పెండింగ్ కేసులు పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సెక్టార్ ఆఫీసర్ల భాధ్యతలు విధిగా అమలు చేయాలని సూచించారు. పెట్రో కార్, బీట్ డ్యూటీ సిబ్బంది ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నారు? పాత నేరస్థుల నివాసాలను కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

# ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ మొబైల్ ల్యాబ్ వ్యాన్ ప్రారంభించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం క్రైమ్, మహా:** నేర పరిశోధనలో కీలకంగా ఉపయోగపడే ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ మొబైల్ ల్యాబ్ వ్యాన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు. సోమవారం జరిగిన ప్రదేశానికి వెళ్లి తక్షణమే పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా ఈ వాహనం పూర్తి సదుపాయాలతో కూడిన మొబైల్ ల్యాబ్ గా పనిచేస్తుందని పోలీస్ కమిషనర్ అన్నారు. నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి, ఆయా ప్రదేశంలో లభించిన అన్ని రకాల సాక్ష్యాలను (ఫింగర్‌ప్రింట్స్, రక్తపు నమూనాలు, ఇతర ఆధారాలు) సేకరించి, ప్రాథమిక విశ్లేషణలు చేసే ఈ వాహనం నేర పరిశోధనలో చాలా ముఖ్యమైనదని అన్నారు. కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, డాక్టర్ వి. నాగలక్ష్మి (శాస్త్రీయ అధికారి) కె. సుధాకర్ (శాస్త్రీయ అధికారి)కె. నరసింహ (అసిస్టెంట్ డైరెక్టర్)ఆర్ ఐ కామరాజు, శ్రీశైలం, సురేష్, నాగులుమీరా, పాల్గొన్నారు.

# ఖమ్మం నుంచి రాజకీయ మార్పు పునాది!

- కాంగ్రెస్-బీఆర్ఎస్ పాలనలపై ప్రజల విరక్తి
- స్థానిక ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టనున్న ఖమ్మం
- బూత్ స్థాయిలో ప్రచారమే విజయ రహస్యం
- మీడియా సమావేశంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, స్థానిక సంస్థల ఎన్నికల ఖమ్మం జిల్లా ఇంచార్జ్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి





**ఖమ్మం, మహా:** తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో ఇప్పుడు ఖమ్మం జిల్లా కేంద్రబిందువుగా మారింది. గతంలో ఎన్టీఆర్‌కు అండగా నిలిచిన ఈ జిల్లా, ఇప్పుడు ప్రధాని మోదీకి నైతిక మద్దతు తెలుపుతోంది. రాజకీయంగా నిరాశకు గురైన ప్రజలు, ప్రభుత్వ విధానాలపై అసహనం వ్యక్తం చేస్తున్న యువత ఈసారి మార్పు కోసం ముందుకు వస్తున్నారనీ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, స్థానిక సంస్థల ఎన్నికల ఖమ్మం జిల్లా ఇంచార్జ్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించిన 'మహా సంపర్క్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మీడియా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. "ఈ జిల్లా గతంలో ఎన్టీఆర్‌కు రాజకీయ బలం ఇచ్చింది. అదే ప్రజలు ఇప్పుడు ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీకి శక్తిని ప్రసాదించబోతున్నారు. ఖమ్మం జిల్లాలో రాజకీయ వాతావరణం మారుతోంది. ప్రజలంతా మార్పు వైపు మొగ్గు చూపుతున్నారు. మేము బూత్ స్థాయిలో ప్రచారం నిర్వహించి, అభివృద్ధిని వివరించనున్నాం" అన్నారు. అదెలా ఉండగా "బీఆర్ఎస్ కుటుంబ కలహాలతో అలజడి. కాంగ్రెస్ ప్రభుత్వంలో శూన్యతే మిగిలింది. సమన్వయం లేక ప్రభుత్వం చీలిపోయినట్లయింది. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితి ఎంత దుర్భరమో ప్రజలు చూస్తున్నారు" అన్నారు. యువతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. "ఖమ్మం జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రతి బూత్‌లో 'మహా సంపర్క్అభియాన్' సమావేశాలు నిర్వహించనున్నాం. మోదీ గారి నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోంది. అదే అభివృద్ధిని రాష్ట్రంలోకి తీసుకురావడానికి బీజేపీని పట్టాలి," అన్నారు. బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వర రావు మాట్లాడుతూ జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో అత్యధిక విజయం సాధించడమే మా లక్ష్యం. గతంలో టీడీపీ వర్గాలు ఇప్పుడు బీజేపీలోకి వచ్చి పార్టీకోసం పని చేస్తున్నాయి. రాష్ట్రంలో ముగ్గురు మంత్రులు ఖమ్మం జిల్లాకు ఉన్నా అభివృద్ధి నిధులు రావడం లేదు. హాస్టళ్లలో విద్యార్థులకు కనీస వసతులు లేవు. ఇది పాలన వైఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనం" అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్థాయి నేతలు దేవకీ వాసుదేవరావు, ఇవి రమేష్, నున్న రవికుమార్, పుల్లారావు యాదవ్, దొంగల సత్యనారాయణ, నంబూరి రామలింగేశ్వరరావు, అల్లిక అంజయ్య, జ్వాలా నరసింహారావు, గడిల నరేష్, ధనియాకుల వెంకటనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అస్వస్థకు గురై జమలాపురపు గోపాలకిషన్ రావు మృతి



**ఎర్రుపాలెం, ఆగస్టు 4, మహా :** విశ్రాంతి అధ్యాపకులు, సర్దార్ జమలాపురం కేశవరావు మెమోరియల్ జూనియర్ కాలేజ్ ఎర్రుపాలెం ఫౌండర్, ప్రిన్సిపాల్ స్వాతంత్ర సమరయోధులు జమలాపురం కేశవరావు గారి సోదరుని కుమారుడు జమలాపురపు గోపాల కిషన్ రావు (87 సం.లు) అస్వస్థతకు గురై విజయవాడ ప్రైవేట్ ఆస్పత్రి లో చికిత్స పొందుతూ ఈరోజు అనగా ఆగస్టు నాలుగవ తేదీ ఉదయం 5.42 నీ.లకు స్వర్గస్తులైనారు. వారి పార్థివ దేహానికి ది 04 తేదీ సోమవారం వారి స్వగ్రామ మైన ఎర్రుపాలెం నందు అంత్యక్రియలు నిర్వహించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ఉపాధ్యాయులు, పలువురు రాజకీయ నాయకులు మండల ప్రజలు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# భాధ్యతలు స్వీకరించిన సబ్ కలెక్టర్



**మహా భద్రాచలం:** భద్రాచలం సబ్ కలెక్టర్ గా మృణాల్ శ్రేష్ఠ సోమవారం భాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆర్ డి ఓ గా విధులు నిర్వహించిన దామోదర్ రావు ఎండోమెంట్ డిపార్ట్మెంట్ కు బదిలీ అయి భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా భాధ్యతలు చేపట్టానున్నారు.

# అర్హుడికి అందని ద్రాక్షల ప్రభుత్వ పథకాలు

- ప్రభుత్వానికి మచ్చ తెస్తున్న ఇందిరమ్మ కమిటీలు
- రాజకీయ జోక్యంతో లబ్ధిదారులకు అన్యాయం
- అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలి



**ఎర్రుపాలెం, ఆగస్టు 4, మహా :** సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ప్రజావాణిలో వినతి పత్రం, లబ్ధిదారుల దరఖాస్తులు అధికారులకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు చేరువయ్యే విధంగా ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు రాజకీయ జోక్యంతో అర్హులకు అందక ప్రభుత్వంపై ప్రజలకు వ్యతిరేకత పెరిగేలాగా చేస్తున్నారని ఇందిరమ్మ కమిటీ సభ్యులు వ్యవహరిస్తున్న తీరు వలన అనర్హులను అందలమెక్కిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను కట్టబెడుతూ పేద ప్రజలకు అందవలసిన ఫలాలను అందకుండా అన్యాయం చేస్తూ ప్రభుత్వానికి మచ్చ తెస్తున్నారని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ రావు విమర్శించారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు అందని అర్హుల జాబితాను సిద్ధపరిచి జమలాపురం గ్రామపంచాయతీ కార్యదర్శి కుమార్ కు ప్రజావాణిలో తహసిల్దార్ ఉషాశారదకు అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని లబ్ధిదారుల దరఖాస్తులను అందించారు. జమలాపురం గ్రామపంచాయతీ వద్ద అర్హులైన లబ్ధిదారులతో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీ సభ్యులు తన అనుయాయులకు తనకు నచ్చిన వారికి మాత్రమే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయించారని అర్హులైన పేదలకు అన్యాయం చేశారని విమర్శించారు. జమలాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల స్థలాల కొరకు 31 దరఖాస్తులు రేషన్ కార్డులకు పది దరఖాస్తులు వృద్ధాప్య పెన్షన్ కొరకు 31 దరఖాస్తుదారులు దరఖాస్తు చేసుకొనగా వాటి పరిష్కారం కొరకు ప్రజావాణిలో సంబంధిత అధికారులకు అందించడం జరిగిందని అన్నారు. దరఖాస్తుదారులు వీటి పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అధికారుల ప్రమేయం లేకుండా ఇందిరమ్మ కమిటీ సభ్యులు తమ ఇష్టానుసారం లబ్ధిదారులను ఎంపిక చేశారని విమర్శించారు. ఈ విషయంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని అసలు పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు గ్రామాలలో మళ్లీ సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలలో ఎటువంటి అన్యాయం జరగకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గొల్లపూడి పెద్ద కోటేశ్వరరావు, పెసర మల్లి ఇమెలమ్మ, గామాసు జోగయ్య, నాగులవంచ వెంకట్రామయ్య, కూడలి నాగేశ్వరరావు, తాళ్లూరు వెంకటనారాయణ, స్థానిక గ్రామ శాఖ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి సాధ్యం



**నేలకొండపల్లి, ఆగస్టు 4 మహా:** డబుల్ ఇంజన్ సర్కార్ తోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్ రావు పేర్కొన్నారు. మండలం లోని పైనంపల్లి, నేలకొండపల్లి లో సోమవారం ఇంటింటి బీజేపీ కార్యక్రమం ను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కాంగ్రెస్ వైఫల్యాలను వివరించే కరపత్రాలను ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...తెలంగాణ లో డబుల్ ఇంజన్ సర్కార్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ విజయాల పరంపరం సాదారణ ఎన్నికల వరకు కొనసాగాలని సూచించారు. పాలనను గాలికొదిలేసిన పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్ గతంలో స్థానిక సంస్థలను నిర్వీరం చేశాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి సొంత ఏజెండా కోసం పాకులాడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో రూ.4,948 కోట్లతో 12,800 కిలో మీటర్ల రోడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, కృష్ణారావు, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, జ్ఞానరత్నం, మల్లెబోయిన గోవిందరావు, షర్ఫుద్దీన్, బాజా రామకృష్ణ, కొండా హర్ష తదిదతరులు పాల్గొన్నారు.

# 11 కేవీ విద్యుత్ లైన్‌లు తొలగింపు



**కూసుమంచి, మహా:** కూసుమంచి మండలం నాయకన్ గూడెం గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇండ్ల మధ్యలో ఉన్నటువంటి 11 కేవీ విద్యుత్ లైన్లను సోమవారం విద్యుత్ శాఖ ఉద్యోగులు తొలగించారు. 11కేవీ లైన్ సమస్యతో గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు పడుతుండగా, ఇట్టి సమస్యను స్థానిక కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దృష్టికి తీసుకెళ్లిగా వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు మంత్రి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో గ్రామంలో ఉన్నటువంటి 11 కేవీ లైన్ లను పరిశీలించి, ఇండ్ల మధ్యలో ఉన్నటువంటి 11 కేవీ లైన్ లను విడతల వారీగా తొలగించడం జరుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. సమస్యను తక్షణమే పరిష్కారం చేపించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి గ్రామస్థులు, నాయకులు ధన్యవాదములు తెలియజఘశారు. అలాగే విద్యుత్ శాఖ సిబ్బంది కి కూడా ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోమిరెల్లి లింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం గంగయ్య, మారోజు భీష్మా చారి, కందిబండ శ్రీధర్, దేశబోయిన నాగేశ్వర పాల్గొన్నారు.

# ప్రభుత్వ హస్పిటల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**నేలకొండపల్లి, ఆగస్టు 4 మహా:** ప్రభుత్వ హాస్పిటల్స్ లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ యం.యర్రయ్య లు సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను స్థానిక బాలికల వసతి గృహంలోకి మార్చిన అనంతరం సోమవారం ఇరువురు అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు...ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్థాయి లో సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఎన్ఎం లు. ఆశా కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ జ్వరపీడుతలను గుర్తించాలని సూచించారు. ప్రజలకు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు వైద్యం మరింత చేరువలో ఉండేందుకు సీహెచ్సీ, పీహెచ్సీ లను వేర్వేరు గా ఉంచుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రావణ్కుమార్, హెచ్ఐవో వీరన్న, చంద్రశేఖర్, ఏఎన్ఎం లు, తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం ఐసీడీఎస్ ఏసీడీపీవో రత్నకుమారి



**నేలకొండపల్లి, ఆగస్టు 4 మహా:** తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ ఏసీడీపీఓ జె.రత్నకుమారి సూచించారు. మండలం లోని నేలకొండపల్లి, చెరువుమాధారం 1 అంగన్వాడీ కేంద్రాలలో సోమవారం తల్లిపాల వారోత్సవాల ను నిర్వహించారు. అనంతరం కొత్తగా చేరిన వారికి అక్షరాభ్యాసం, అన్నప్రసాన కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...బిడ్డకు తల్లిపాలు వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కేంద్రాలకు వచ్చే వారికి పచ్చని తివాచీ స్వాగతం పలుకుతున్నట్లు పచ్చటి మొక్కలను పెంచాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్రాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం – చేసుకోవాలని సూచించారు. అమ్మ మాట... అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా కేంద్రాలలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. 2–4 ఏళ్ల పిల్లలను కేంద్రాలలో చేర్పించాలని సూచించారు. 5 ఏళ్లు దాటిన వారిని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లు.పి. నాగమణి, కె.పార్వతి, అంగన్వాడీ టీచర్స్. చిన్నారులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఆయిల్ పామ్ సాగుపై విజ్ఞాన యాత్ర

**చింతకాని, బోనకల్లు మండలాల రైతుల పర్యటన**



**సత్తుపల్లి, మహా:** మధిర డివిజన్ పరిధిలోని బోనకల్లు, చింతకాని మండలాలకు చెందిన రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ, ఉద్యాన వన శాఖలు సోమవారం రైతు విజ్ఞాన యాత్రను నిర్వహించాయి. ఈ సందర్భంగా రైతులు సత్తుపల్లి మండలం బేతుపల్లి గ్రామంలోని ఆయిల్ పామ్ తోటలను సందర్శించారు. అక్కడ సాగు విధానాలు, ఆదాయ అవకాశాల గురించి మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయ చంద్ర వివరించారు. ఆయిల్ పామ్‌తో పాటు వక్క, మిరియాలు, కోకో వంటి అంతరపంటల సాగు వల్ల వచ్చే లాభాలను తెలియజేశారు. తర్వాత దమ్మపేట మండలంలోని అప్పారావుపేట వద్ద గల ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని రైతులు పరిశీలించారు. ఈ విజ్ఞాన యాత్రలో మండల వ్యవసాయ అధికారులు పసునూరి వినయ్ కుమార్, సోములపల్లి మానస, ఉద్యాన వన అధికారి విష్ణు, విస్తరణ అధికారులు బంధం రజిత, మరీదు త్రివేణి, గోగుల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. రైతులతో పాటు ఆయిల్ పామ్ ఏరియా అధికారి బి. నరేశ్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగిని ఇంట్లో భారీ చోరీ



**కొత్తగూడెం, మహా:** సింగరేణి ఉద్యోగిని ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఈ సంఘటన సోమవారం కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారంయిచుంచుపల్లి మండలం రుద్రంపూర్ డి.530 క్వార్టర్‌లో నివసించే వాకపల్లి వెంకటరమణ, సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో క్లర్క్‌గా పనిచేస్తున్నారు. ప్రతిదినం మాదిరిగానే ఆమె ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లగా, ఇంట్లో ఎవరు లేకపోవడాన్ని దొంగలు అవకాశంగా తీసుకున్నారు. ఇంట్లోకి చొరబడిన వారు బీరువా పగులగొట్టి అందులోని 20 తులాల బంగారాన్ని, రూ. 2 లక్షల నగదును అపహరించుకుపోయినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న కొత్తగూడెం టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ డి.ప్రతాప్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకొని వేలిముద్రల నమూనాలను సేకరించి దర్యాప్తు కొనసాగిస్తోంది.

# పాలిటెక్నిక్‌లో మిగిలిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్



**కొత్తగూడెం, మహా:** కొత్తగూడెం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 11వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ తెలిపారు. పాలీసెట్–2025లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, పాలీసెట్ రాయకపోయిన వారు పదో తరగతి ఉత్తీర్ణులైతే వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్పాట్ అడ్మిషన్ల కోసం ఈ నెల 5 నుండి 10వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని సూచించారు. దరఖాస్తుతో పాటు అన్ని అవసరమైన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు జత చేయాలని తెలిపారు. స్పాట్ కౌన్సెలింగ్‌లో ఎంపికైన విద్యార్థులు తప్పనిసరిగా ఒరిజినల్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ)తో పాటు ఇతర ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి సమాచారం కోసం కళాశాల అధికారులను సంప్రదించవచ్చని సూచించారు.

# రక్తదానం చేసిన కలెక్టర్ జితేష్

## మణుగూరులో నూతన బ్లడ్ బ్యాంక్ ప్రారంభం

### రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్






**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 04 (మహా):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతన ఏర్పాటుచేసిన రక్త నిల్వ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, రిబ్బన్ కటింగ్ చేసి, బ్లడ్ బ్యాంక్ లో ఏర్పాట్లను పరిశీలించారు . రక్త నిల్వ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ స్వయంగా రక్తదానం చేసి ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలిచారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రక్తదానం అంటే ప్రాణదానం, మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం ఇతరరికి జీవం పోసే వరంగా మారుతుంది. గర్భిణీలు, తలసీమియా, సికిల్ సెల్, అనీమియా వంటి వ్యాధులతో బాధపడేవారు, ప్రమాదాల వల్ల గాయపడిన వారు రక్తానికి ముఖ్యంగా ఆధారపడుతారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ సంవత్సరంలో కనీసం రెండు సార్లు రక్తదానం చేయాలిఅని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం ద్వారా రక్తహీనతతో బాధపడే గర్భిణీలు, తల సేమియా, సికిల్ సెల్, అనీమియా, వంటి రోగులకు మరియు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఈ రక్తం ప్రాణ రక్షణగా మారుతుంది అన్నారు. మణుగూరులో ఈ రక్త నిల్వ కేంద్రం ఏర్పాటు కావడం ద్వారా, అత్యవసర పరిస్థితులలో పేషెంట్లకు రక్తాన్ని సమీపంలోనే అందుబాటులోకి తేవచ్చు. ఇప్పటి వరకు రక్త అవసరాల కోసం ఖమ్మం, భద్రాచలం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై అది అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన స్ఫూర్తితో డి సి హెచ్ ఎస్ డాక్టర్ రవిబాబు, ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ సునీల్ మరియు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ముందుకు వచ్చి రక్తదానం చేశారు. సందర్భంగా 20 మంది రక్తదానం చేశారు. నూతనంగా ప్రారంభించిన రక్తనిల్వ కేంద్రానికి సరిపడా రక్త నిల్వల కోసం ఈ రక్తాన్ని ఉపయోగిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, మరియు శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీ సీఈఓ నాగలక్ష్మికి డీఈవోగా అదనపు బాధ్యతలు



**కొత్తగూడెం, మహా:** జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (జడ్పీ సీఈఓ) నాగలక్ష్మి తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారిణిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఆమె ఐడీఓసీలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గత నెల 31వ తేదీన జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి పదవీ విరమణ చేసిన నేపథ్యంలో, ఈ పోస్టును తాత్కాలికంగా భర్తీ చేయాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సూచనలు జారీ చేశారు. స్పందించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జడ్పీ సీఈఓ నాగలక్ష్మిని డీఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఇప్పటి నుంచి ఆమె రెండు పదవుల్లోను బాధ్యతలు నిర్వర్తించనున్నారు. జిల్లాలో పాఠశాల విద్యా వ్యవస్థను మరింత సమర్థంగా ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని నాగలక్ష్మి తెలిపారు.

# పెద్ద తండాలో విషాదం

## నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి

**కొత్తగూడెం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మాచినేనిపేట పంచాయతీ పెద్ద తండాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఇంటి ఆవరణలో ఆడుకుంటూ నీటి తొట్టిలో పడిపోయిన రెండున్నరేళ్ల చిన్నారి మృతి చెందింది. స్థానికంగా నివసించే భూక్యా గోపీనాయక్, సరస్వతి దంపతులకు ఇద్దరు పిల్లలు. వీరిలో కూతురు తన్విశ్రీ సోమవారం రాత్రి తల్లి సరస్వతితో కలిసి అదే గ్రామంలో ఉన్న అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. ఇంటి పనుల్లో తల్లి, అమ్మమ్మ నిమగ్నమై ఉన్న సమయంలో చిన్నారి ఆడుకుంటూ నీటి తొట్టిలో పడిపోయింది. కొద్దిసేపటి తర్వాత తల్లిదండ్రులు బాలిక కనిపించకపోవడంతో వెతకసాగారు. ఆ తరువాత తన్విశ్రీ నీటితొట్టిలో విగతజీవిగా కనిపించడంతో అందరూ శోకసంద్రంలో మునిగిపోయారు. చిన్నారిని ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తల్లిదండ్రులు కుమార్తె మరణాన్ని జీర్ణించుకోలేక కన్నీరుమున్నీరు కాగా, గ్రామమంతా విషాద ఛాయలు అలముకున్నాయి.

# ప్రజా సేవకు దశాబ్దాల అనుభవం

- కాంగ్రెస్ కండువా కప్పుకున్న కొండబాల
- ప్రజా అవసరాల కోసం సమైక్యంగా ముందడుగు
- ప్రజల అవసరాలు తీర్చేందుకు చేయి చేయి కలిపి పని చేద్దాం... భట్టి విక్రమార్క
- సొంతింటి చాటునే కాంగ్రెస్" - పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**ఖమ్మం, మహా:** ఖమ్మం జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా వెలుగొందిన మాజీ ఎమ్మెల్యే, మాజీ టిడిపి జిల్లా అధ్యక్షుడు కొండబాల కోటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరడం కలకలం సృష్టించింది. ప్రజా సమస్యలను స్వయంగా అనుభవించి, వాటిని పరిష్కరించేందుకు అనేక హోదాల్లో సేవలందించిన ఆయన ఇప్పుడు కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో జిల్లాలో రాజకీయ సన్నివేశం మరోసారి మార్చినట్లయింది. ఈ చేరిక సందర్భంగా రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లు ఆయనకు ఘన స్వాగతం పలికారు.



### కొండబాల చేరికపై భట్టి విక్రమార్క వ్యాఖ్యలు

"ప్రజల అవసరాలు తీర్చేందుకు చేయి చేయి కలిపి పని చేద్దాం" అని వ్యాఖ్యానించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కొండబాల కోటేశ్వరరావును కాంగ్రెస్ పార్టీలో హృదయపూర్వకంగా స్వాగతించారు. సర్పంచ్ స్థాయి నుంచి ప్రారంభమైన ఆయన దశాబ్దాల రాజకీయ ప్రస్థానం ప్రజాసేవకు అంకితం కావడం గర్వకారణమన్నారు. స్థానిక సంస్థల చైర్మన్ గా, కార్పొరేషన్ హోదాలో పని చేసిన అనుభవంతో పాటు, చట్టసభలపై ఆయనకు ఉన్న లోతైన అవగాహన పార్టీకి తోడ్పడుతుందని భట్టి పేర్కొన్నారు.

### "సొంతింటి చాటునే కాంగ్రెస్" పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

కొండబాల కాంగ్రెస్ పార్టీలో చేరడం తన సొంతింటికి తిరిగివచ్చినట్లేనని పేర్కొన్న మహేష్ కుమార్ గౌడ్, ఖమ్మం జిల్లాలో పార్టీ మరింత పుంజుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టిల నేతృత్వంలో ప్రజల మనస్సు గెలుచుకునేలా చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు నాయకులు కాంగ్రెస్ వైపు పరుగులు తీస్తున్నారని వివరించారు.

### "కాంగ్రెస్ట్ పేద ప్రజల ఆశ్రయం" కొండబాల

దేశ రాజకీయ పరిస్థితులు, రాష్ట్రంలో నెలకొన్న వాస్తవాలను విశ్లేషించిన తరువాతే తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు కొండబాల వెల్లడించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీగా, అభ్యర్థిగా పనిచేశానని గుర్తు చేస్తూ – తాను పునరాగమనాన్ని ప్రజల కోసం అంకితం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. "దేశాన్ని బలోపేతం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదే. పండిట్ నెహ్రూ కాలం నుంచే పేదల అభివృద్ధికి అడుగులు పడతూనే ఉన్నాయి," అని కొనియాడారు.

### పబ్లిక్ సెక్టార్ రంగాల విజయాలకు కాంగ్రెస్ బాధ్యత

అన్ని వర్గాల సంక్షేమం కోసం పబ్లిక్ సెక్టార్ పరిశ్రమలను స్థాపించిన ఘనత కాంగ్రెస్ పాలనలదేనని పేర్కొన్న కొండబాల, గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేయడంలో డే లాంటి విదేశీ నిపుణులను కూడా దేశానికి రప్పించిన జవహర్‌లాల్ నెహ్రూ దూరదృష్టిని స్మరించుకున్నారు. ఇప్పటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అదే దిశగా సంక్షేమ పథకాలతో ప్రజల మధ్య విశ్వాసాన్ని పెంచుతోందని తెలిపారు.

### రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు: కొండబాల అభిప్రాయం

తనతో పాటు ప్రస్తుతం కొంతమంది చేరినప్పటికీ, రాబోయే రోజుల్లో పెద్ద సంఖ్యలో ఖమ్మం జిల్లాలో నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరతారని కొండబాల తెలిపారు. తాను చేరడం పార్టీకి బలమని, ప్రజల సంక్షేమానికి ఇది పెద్ద అడుగని విశ్వాసం వ్యక్తం చేశారు.

## బొజ్జాయిగూడెం వద్ద భారీ గంజాయి పట్టివేత



**ఇల్లెందు, మహా:** ఇల్లెందు మండలంలోని బుజ్జాయిగూడెం వద్ద పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం కొత్తగూడెం ప్రధాన రహదారిపై వాహన తనిఖీల సందర్భంగా ఈ ఘటన వెలుగు చూసింది. ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను తెలిపిన వివరాల ప్రకారం, ఇల్లెందు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి సిబ్బందితో కలిసి బుజ్జాయిగూడెం పంచాయతీ ఆఫీస్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో మహీంద్రా ఎక్స్‌యువి 300 (టి ఎస్ 12ఈ కే 3236) కారు అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి పరిశీలించారు. కారులో 45.256 కేజీల నిషేధిత గంజాయి గుర్తించారు. అదనంగా, మహారాష్ట్ర జాల్నా జిల్లా మహాకాల్‌కు చెందిన హరిబాబు అలియాస్ హరిఓం, ఒడిశా అలూరికోటకు చెందిన రాము, తాతారావు లు ఈ గంజాయిని భద్రాచలం, ఇల్లెందు మార్గంగా మహారాష్ట్రకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 22,62,800/–గా అంచనా వేశారు. కాగా, ముగ్గురు నిందితుల వద్ద నుండి మూడుప్రముఖ మొబైల్ ఫోన్లు, ప్రయాణించిన కారు కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసిన వస్తువులను ఇల్లెందు సీఐ తాటిపాముల సురేష్‌కు అప్పగించారు.

## వైరాలో రిటైర్డ్ ఎస్ఐ ఇంట్లో భారీ చోరీ

**వైరా, మహా:** వైరా టౌన్‌లో దొంగలు బీదికి బంగారం మాయం చేశారు. ఇంటిలిజెన్సీ విభాగానికి రిటైర్డ్ ఎస్ఐగా పనిచేసిన బీడీకే రత్నం (మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్) నివాసం ఉంటున్న ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఖాకీ ప్యాంట్ జేబులో భద్రపరిచిన బంగారు ఆభరణాలను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. మొత్తం 22.5 తులాల బంగారం, దాదాపు రూ.20 లక్షల విలువైన ఆభరణాలు మాయమయ్యాయి. వైరా 9వ వార్డులోని శ్రీనివాస థియేటర్ ఎదురుగా ఉన్న ఇంట్లో రత్నం అద్దెకు ఒంటరిగా ఉంటున్నారు. గతంలో ఆయన భార్య, తల్లి మృతి చెందగా, వారిద్దరి ఆభరణాలను ఇంట్లోనే భద్రపరిచారు. జూలై 31వ తేదీన స్టోర్ రూమ్‌లో ఉన్న ఓ ఓపెన్ సెల్ఫ్‌లో తన ఖాకీ ప్యాంట్ జేబులో పర్సుతో పాటు ఆభరణాలు ఉంచారు. ఆగస్ట్ 1వ తేదీ ఉదయమే రత్నం తలంపుల ప్రకారం వేలంగిని చర్చికి వెళ్లి ఆగస్ట్ 3న తిరిగి వచ్చారు. ఇంటికి రాగానే ఆ ఖాకీ ప్యాంటు కనిపించకపోవడంతో తనకు చోరీ జరిగినట్లు తెలుస్తోంది అన్నారు. బీడీకే రత్నం ఫిర్యాదు మేరకు వైరా ఏసీపీ రెహమాన్, సీఐ ఎన్.సాగర్, ఎస్ఐ పి.రామారావు, ప్రొబెషనరీ ఎస్ఐ పవన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఖమ్మం క్లూస్‌టీమ్ సభ్యులు వేలిముద్రలను సేకరించారు. ఇంటికి వేసిన తాళాలు ఎలాంటి ధ్వంసం లేకుండా ఉండటంతో ఇంట్లోకి దొంగలు ఎలా ప్రవేశించారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ కేసుపై విచారణ జరుపుతున్నామని ఎస్ఐ రామారావు తెలిపారు.

## న్యూలక్ష్మీపురం కెజిబివిలో వైద్య శిబిరం

**ముదిగొండ ఆగస్టు 04 మహా:** మండలపరిధిలో న్యూలక్ష్మీపురం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పిహెచ్సి ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించి,బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈసందర్భంగా వైద్యాధికారి డాక్టర్ అంకం అరుణాదేవి మాట్లాడుతూ రోగాల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలం సీజనల్గా వచ్చే వ్యాధుల,నివారణకు ఆరోగ్య నియమాలను పాటించాలన్నారు.హాస్టల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలన్నారు.వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు,పరిసరాలను శుభ్రతగా ఉంచుకోవాలన్నారు.బాలికలకు ఎవరికైనా జ్వరాలు వస్తే పిహెచ్సికి రావాలన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్స్ లత, పద్మావతి,ల్యాబ్ టెక్నీషియన్ రెడ్డిబోయిన రామారావు,ఏఎన్ఎం రత్నకుమారి,ఆశ వర్కర్లు కెజిబివి సిబ్బంది పాల్గొన్నారు.



## సిఐగా పదోన్నతి పొందిన నరేష్‌కు సన్మానం

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 04 (మహా):** ట్రాఫిక్ ఎస్ఐ గా పనిచేస్తున్న నరేష్, పదోన్నతి పొందిన సందర్భంగా, దళిత జేఏసీ. రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎంతగానో కంట్రోల్ చేశారని, అదేవిధంగా వాహనదారులకు భద్రత గురించి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. ఆయన సిఐ గా ప్రమోషన్ పొంది ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి రిలీవ్ అవుతున్న సందర్భంగా దళిత జేఏసీ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు . ఈ కార్యక్రమంలో దళిత జేఏసీ. రాష్ట్ర నాయకులు ఆంతోటి పాల్. దళిత జేఏసీ చైర్మన్ నవతన్. కిషోర్. శ్రీనివాస్ యాదవ్. తదితరులు పాల్గొన్నారు.

## నిర్విరామ సేవలకు ప్రత్యేక కృతజ్ఞతలు



**ఖమ్మం,మహా:** ప్రజలకు నిర్విరామంగా సేవలు అందించిన అధికారులు, సిబ్బందికు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో జూలై నెలలో పదవి విరమణ పొందిన 13 మంది అధికారులు, సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. డిపిఆర్ఓ కార్యాలయ డ్రైవర్ బి. నరసయ్య, ఇంటర్మీడియట్ విద్యా విభాగానికి సంబంధించి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస రావు, ప్రిన్సిపాల్, ఏ. వెంకటేశ్వర్లు, లైబ్రేరియన్ సత్యనారాయణ, హిస్టరీ జూనియర్ లెక్చరర్ పి.వి. నాగేందర్ రావు, హార్టికల్చర్, సెరికల్చర్ విభాగం సూపరింటెండెంట్ ఎస్. విజయ కుమార్, వైద్యారోగ్య శాఖ సి.హెచ్.ఓ. డాక్టర్ కే సుధారాణి, ఎంపి హెచ్ఎస్ విజయ్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ అసిస్టెంట్ ఎన్. ఎల్లస్వామి, గిరిజన సంక్షేమ శాఖ లో సహాయ గిరిజన అభివృద్ధి అధికారి జహీరుద్దీన్, పంచాయతీరాజ్ శాఖ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, కొణిజెర్ల తహసిల్దార్ కార్యాలయ సబార్డినేట్ రామచందర్, డి.ఆర్.డి.ఓ. లోని ఏ.పి.ఓ పద్మ పదవీ విరమణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పదవీ విరమణ జీవితంలో చాలా కీలకమైన ఘట్టమని అన్నారు. మనకు గుర్తింపు ఉద్యోగం నుంచి లభిస్తుందని అన్నారు. 30 నుంచి 40 సంవత్సరాల పాటు ప్రభుత్వ రంగంలో సేవలు అందించడం చాలా గొప్ప విషయమని అన్నారు. వివిధ రంగాలలో దశాబ్దాల కాలంగా ప్రజలకు సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. పదవి విరమణ పొందిన సిబ్బంది వారి అభిప్రాయాలను తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ పదవి విరమణ పొందిన వారినీ ఘనంగా సన్మానించారు. విధుల పట్ల నిబద్ధతతో బి. నర్సయ్య వ్యవహరించారు.... జిల్లా పౌరసంబంధాల అధికారి గౌస్ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పదవీ విరమణ సన్మానం పొందిన అనంతరం జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో సిబ్బంది సమక్షంలో పదవీ విరమణ పొందిన డ్రైవర్ బి. నర్సయ్యను జిల్లా పౌరసంబంధాల అధికారి గౌస్, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల అధికారి మాట్లాడుతూ ఈ కార్యాలయ డ్రైవర్ బి. నర్సయ్య 1990 అక్టోబర్ 6న ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన నాటి నుండి నేటి వరకు అందరి మన్ననలు పొందుతూ, తమ విధులను సమర్ధవంతంగా నిర్వహించారని, వారు అందించిన సేవలతో జిల్లాలో సమాచార సేకరణ, మంత్రుల పర్యటన, జిల్లా కలెక్టర్, విఐపిల పర్యటనను విజయవంతంగా నిర్వహించామని అన్నారు. పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# నులి పురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఆగస్టు 11న జిల్లాలో 19 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న
- పిల్లలందరికి తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయాలి
- ఆగస్టు 11న మిస్ అయ్యే పిల్లలకు ఆగస్టు 18న మాత్రలు వేయాలి
- నులిపురుగుల నివారణకు మందుల పంపిణీపై జిల్లా కలెక్టర్ సమీక్ష



**ఖమ్మం,మహా:** నులి పురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి, కలెక్టరేట్ సమావేశ మందిరంలో నులి పురుగుల నివారణకు చేపట్టే అల్బెండజోల్ మందుల పంపిణీ కార్యక్రమంపై సోమవారం జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నులి పురుగుల నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని, 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు తప్పని సరిగా అందించాలని, లేని పక్షంలో పిల్లల ఎదుగుదలపై ప్రభావం పడుతుందని అన్నారు. నులి పురుగులు చాలా ప్రమాదకరమని, వీటి వల్ల రక్తహీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, వీటిని నివారిస్తే ఆరోగ్యంగా వుండవచ్చునని అన్నారు. నులి పురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం, పోలియో తరహాలో ప్రతి ఒక్కరికి చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. లగురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో పిల్లలకు మందుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో నులి పురుగుల పంపిణీ సమయంలో ఎక్కడైనా విద్యార్థులకు సైడ్ ఎఫెక్ట్స్ వస్తే చికిత్స అందించేందుకు వైద్య బృందాలు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. ఆగస్టు 11న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలో 19 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న పిల్లలందరికి తప్పనిసరిగా మాత్రలు అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆగస్టు 11 నాడు మాత్రలు అందించని విద్యార్థులకు తప్పనిసరిగా ఆగస్టు 18 నాడు అందించాలని అన్నారు. విద్యా సంస్థల బయట ఎవరైనా పిల్లలు ఉంటే వారికి కూడా తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మందులు అందేలా కార్యాచరణ చేయాలని అన్నారు. మాత్రలు ఇంటికి తీసుకెళ్లడానికి ఇవ్వకూడదని, పాఠశాలల్లోనే టీచర్ల సమక్షంలోనే మందులు వేయాలని అన్నారు. వైద్య అధికారులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్ వాడి టీచర్లకు, ఆశ కార్యకర్తలు, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాల టీచర్లకు అవసరమైన శిక్షణ, అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి అంగన్వాడీ కేంద్రం, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలకు నులి పురుగుల మాత్రలు ఏ పి.హెచ్.సి నుంచి వెళ్ళాలో మ్యాప్ చేసి పెట్టుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలకు ముందస్తు సమాచారం అందించి పూర్తి స్థాయిలో విద్యార్థులు ఆ రోజు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గ్రామాలలో స్థానిక నాయకులు, పంచాయతి కార్యదర్శులు సైతం తమ గ్రామాలలో పూర్తి స్థాయిలో విద్యార్థులకు మాత్రలు అందేలా పర్యవేక్షించాలని, కార్యక్రమం గురించి గ్రామంలో డప్పు చాటింపు వేయించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్య నభ్యసిస్తున్న ప్రతి పిల్లవాడికి తప్పని సరిగా మాత్రలు అందే విధంగా జిల్లా విద్యా శాఖ అధికారి చర్యలు తీసుకోవాలని, పాఠశాలలకు జాతీయ నూలిపురుగుల నివారణ దినోత్సవ నిర్వహణ, మాత్రల పంపిణీపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# విద్యార్థుల ఆహారం నాణ్యత లోపిస్తే క్రిమినల్ కేసులు

**మహా భద్రాచలం:** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల మరియు పోస్ట్మెట్రిక్, ప్రీ మెట్రిక్, గురుకులాలు, ఈఎంఆర్ఎస్ పాఠశాలల్లో గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు సరఫరా చేస్తున్న అల్పాహారం, భోజనాల విషయంలో వారం రోజులుగా జరుగుతున్న పరిణామాలు ఒక హెచ్చరికగా భావించి ఇకముందు ఇటువంటి పరిణామాలు పునరావృతం కాకుండా చూడవలసిన బాధ్యత సంబంధిత ప్రిన్సిపాల్ హెచ్ఎం వార్డెన్లపై ఉందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. సోమవారం నాడు రాత్రి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని విధాన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న ఇన్స్టిట్యూషన్లలో పనిచేయుచున్న ప్రిన్సిపాల్, హెచ్ఎం వార్డెన్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని సూచనలు ఇస్తూ ఒకటిన్నర సంవత్సరాలుగా మన ఇన్స్టిట్యూషన్లో చదివే విద్యార్థినీ విద్యార్థుల చదువుపరంగా గాని, ఆహార విషయంలో గాని, ఆరోగ్య విషయంలో గానీ ఎటువంటి పొరపాట్లు జరగలేదని, కానీ ఈ మధ్యకాలంలో సిబ్బంది నిర్లక్ష్యం మరియు వార్డెన్ హెచ్ ఎం ల అశ్రద్ధ వలన చాలా తప్పులు జరుగుతున్నాయని ఇక ముందు ఇలా జరగకుండా చూసుకోవలసిన బాధ్యత మీపై ఉందని కమిషనర్ జాయిన్ అయి వారం రోజులు కూడా కాలేదని, మన జిల్లాలో ఉన్న ఇన్స్టిట్యూషన్లో ఇటువంటి తప్పులు దొర్లడం చాలా క్షమించరాని విషయమని, ఎవరిని ఉపేక్షించమని ఇకముందు ఇటువంటి పరిమాణాలు ఏ ఇన్స్టిట్యూషన్లో జరిగినా, ఆ సిబ్బందిపై క్రిమినల్ కేసులు పెట్టి శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. విద్యార్థులకు అందించే ఫుడ్ విషయంలో ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని అన్నారు. విద్యార్థులకు వండిన ఆహారాన్ని ముందుగా ఉపాధ్యాయులు తిన్న తర్వాతనే సర్వ్ చేసి పిల్లలకు పెట్టాలని, పిల్లలు భోజనాలు చేసిన తర్వాత అస్వస్థకు గురి అయితే సర్వ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జి సి సి నుండి సరఫరా అయ్యే బియ్యం పప్పులు అన్ని సక్రమంగా చూసుకోవాలని ఏమైనా నాసిరకంగా ఉంటే వాపస్ చేసి వెంటనే ఏటీడీవోకు



తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఆర్సీఓ గురుకులం అరుణకుమారి, ఏటీడీవోలు చంద్రమోహన్, అశోక్ కుమార్, రాధమ్మ మరియు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రిన్సిపాల్, హెచ్ఎం వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీ హాస్టల్ ఘటనపై మట్టా రాగమయి సీరియస్

- విద్యార్థినుల క్షేమం కోసం రంగంలోకి దిగిన ఎమ్మెల్యే
- సొంత కాన్వాయ్‌తో విద్యార్థినుల తరలింపు
- హాస్టల్ సిబ్బందిపై ప్రశ్నల వర్షం



**కల్లూరు, మహా:** కల్లూరు ఎస్సీ హాస్టల్ ఫుడ్ పాయిజన్ ఘటనపై సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సీరియస్ అయ్యారు. సోమవారం ఉదయం హాస్టల్లో 50 మంది విద్యార్థుల పైగా అస్వస్థ గురువు కావడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న వారు సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.గిరిజన బాలికల హాస్టల్‌లోఉదయం కిచిడీ తిన్న విద్యార్థినుల్లో కొందరికి కడుపునొప్పి, వాంతులు రావడంతో పరిస్థితి వేగంగా తీవ్రమైంది. దాదాపు 50 మందికి పైగా విద్యార్థినీలు తీవ్ర అస్వస్థతకు లోనై అస్తవ్యస్త పరిస్థితుల్లో గడిపారు. సమయానికి స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ స్వయంగా ఆసుపత్రిలో విద్యార్థినులను పరామర్శించారు. అత్యవసరంగా రెండు ప్రత్యేక అంబులెన్సులను ఏర్పాటు చేయించారు. తక్షణ సహాయ చర్యల కోసం సీనియర్ నాయకులు ట?గర్ డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ సూచనల మేరకు ఆళ్లకుంట, పసుమర్తి, ఏనుగు, తురాబ్ అలీ వంటి నాయకుల బృందాలు రంగంలోకి దిగాయి.అదేవిధంగా ఈ విషయంపై అప్రమత్తమైన కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎమ్మార్వో పులి సాంబశివుడు, ఆర్డీవో చంద్రశేఖర్ లు హుటాహుటిన హాస్టల్‌కు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఆసుపత్రిలో చేరిన విద్యార్థినులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థినులను గిరిజన హాస్టల్ నుంచి సురక్షితంగా తరలించి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఎమ్మెల్యే స్వయంగా తన కాన్వాయ్ వాహనాలను వినియోగించి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ వేగవంతమైన చర్యల పట్ల స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. డాక్టర్ నవ్యకాంత్ తెలిపిన ప్రకారం, "వీరిలో చాలామంది ఆసుపత్రి చేరిన కొద్ది గంటల్లోనే కొలుకుంటున్నారు. మరో 8 గంటల్లో పూర్తిగా కోలుకునే అవకాశం ఉంది."ఆసుపత్రి పర్యటన అనంతరం ఎమ్మెల్యే మట్టా గిరిజన బాలికల హాస్టల్‌ను సందర్శించారు. అక్కడి సమస్యలను గుర్తించి సిబ్బందిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. త్వరలో హాస్టల్‌లో శుభ్రత, శుద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడిన ఎమ్మెల్యే, వారి వ్యక్తిగత సమస్యలను తెలుసుకున్నారు. అనేకమైన సమస్యలను నమోదు చేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎమ్మార్వో పులి సాంబశివుడు ప్రకటించారు. విద్యార్థినుల ఆరోగ్యంపై నిరంతర నిఘా ఉంచుతూ, హాస్టళ్లలో ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెడతామని హామీ ఇచ్చారు.

# స్వాతంత్ర్య వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు



**ఖమ్మం, మహా:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగేలా ప్రతి విభాగం తమకు కేటాయించిన విధులను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి ప్రశంసాపత్రాల పంపిణీ కోసం నిర్దిష్టమైన సంఖ్యలో మాత్రమే దరఖాస్తులు రావాలని కలెక్టర్ సూచించారు. ప్రశంసా పత్రాలు నిజంగా పనిచేసే సిబ్బందికి దక్కేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. లిఅదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పెరేడ్ గ్రౌండ్లో వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లాలో జరుగుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని శాఖల నుంచి బ్రీఫ్ నోట్స్ తెప్పించుకొని ముఖ్య అతిథి సందేశం తయారు చేయాలని జిల్లా పౌర సంబంధాల అధికారినీ ఆదేశించారు. జాతీయ పతాకావిష్కరణ, గౌరవ వందనం, పెరేడ్ వంటి కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లను పోలీస్ శాఖ అధికారులు చేయాలని అన్నారు. విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు పంపిణీ కోసం ప్రతిపాదనలు ఆగస్టు 12 నాటికి అందించాలని అన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో స్టాల్స్ వినూత్నంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాం లను హైలైట్ చేసే విధంగా స్టాల్స్ ఉండాలని అన్నారు. ఆర్డీవో, ఆర్ అండ్ బీ, మున్సిపల్ శాఖ అధికారులు సమన్వయంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. 25 నుంచి 30 నిమిషాల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉండేలా ప్లాన్ చేయాలని అన్నారు.

# లాలపురంలో బిజెపినేతలు పర్యటన

## ఇంటింటికి కరపత్రాలు పంపిణీ

### బిజెపినీ ఆదరించాలని పిలుపు



**కొణిజర్ల, మహా:** కొనిజర్ల మండలంలోని లాలాపురం గ్రామంలో భారతీయ జనతా పార్టీ నాయకులు సోమవారం రాత్రి పర్యటించారు. మహా సంపర్క అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర నాయకులు, స్థానిక సంస్థల ఎన్నికల ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి , జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు తదితరులు ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామంలోని దామా వీరయ్య , రాయల రామారావు ల ఇంటికి వెళ్లి భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు పెద్దిరెడ్డి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని ఆదరించాలని కోరారు. అంతేకాకుండా గ్రామ అభివృద్ధి కోసం భారతీయ జనతా పార్టీ చేస్తున్న కృషిని పథకాలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలోని రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తుందని చెప్పకు వచ్చారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఉన్న నేతలందరూ ఆస్తులు కూడబెట్టుకునేందుకు ప్రజాశపడుతున్నారే తప్ప రాష్ట్ర అభివృద్ధిపై ఏ మాత్రం శ్రద్ధ వహించడం లేదని వివరించారు. గ్రామ అభివృద్ధి కోసం వచ్చే ప్రతి పైస భారతీయ జనతా పార్టీ నుంచి వస్తుందని మోడీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవకి వాసుదేవరావు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, తోడుకునూరి రవీందర్, చింతనిపు రామారావు, దుద్దుకూరి కార్తీక్, వల్లేప అనిల్ కుమార్, మనుబోలు వెంకటకృష్ణ, పల్లపాటి వెంకటేశ్వర్లు, ఎన్ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గ్రామస్థాయిలో బీజేపీ పటిష్టతే లక్ష్యం





- ప్రతి కార్యకర్త తన బాధ్యత నెరవేర్చాలి
- గ్రామ అభివృద్ధికి కేంద్ర నిధులే ఆధారం
- రాష్ట్రం ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదు
- కాంగ్రెస్ పాలన శూన్యంగా మారింది
- బీజేపీ అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్లండి
- స్థానిక సంస్థలన్నీ మన చేతిలోకి రావాలి

**వైరా, మహా:** గ్రామ స్థాయిలో భారతీయ జనతా పార్టీని పటిష్టం చేయడం ప్రతి కార్యకర్తదే బాధ్యతగా భావించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, స్థానిక సంస్థల ఎన్నికల ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లాలోని వైరా మండల పరిధిలోని కొండకోడిమ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో సమావేశమై, పార్టీ బలోపేతానికి మార్గదర్శకత్వం అందించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యకలాపాల్లో రాష్ట్ర ప్రభుత్వ పాలుపంచుకోలేదని, కేంద్రం నుంచి వచ్చిన నిధుల ద్వారానే గ్రామాభివృద్ధి జరుగుతోందని పెద్దిరెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై శూన్య శ్రద్ధ కనబరుస్తోందని, ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధికి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకుండా తమ స్వప్రయోజనాలకే పరిమితమై ఉన్నారని మండిపడ్డారు. “టీఆర్ఎస్ పాలనపై పదేళ్లలో ప్రజలు విరక్తి చెందారు. కానీ కాంగ్రెస్ పాలనకు ఏడాదిలోనే ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు అని విమర్శించారు. గ్రామాభివృద్ధిలో ప్రధాన భాగస్వామిగా ఉన్న బీజేపీ కేంద్ర పథకాల ద్వారా ఎంతో పనిచేస్తోంది. ఈ విషయాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలన్నదే ప్రతి కార్యకర్త లక్ష్యం కావాలి” అని చెప్పారు. “ప్రతి గ్రామంలో మా అభ్యర్థి గెలవాలి. స్థానిక సంస్థలన్నీ మనవే కావాలి. జడ్పీటీసీ స్థాయి వరకూ మన అభ్యర్థులే నిలబడాలి. కార్యకర్తలు శక్తివంతంగా పనిచేస్తే విజయం మనదే” అని ఉత్తేజభరితంగా సూచనలు చేశారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. పలు వీధుల్లో నినాదాలు చేస్తూ ప్రజల మద్దతును కోరారు. “భారత్ మాతాకీ జై”, “బీజేపీ అభివృద్ధికి ఓటు వేసి” అంటూ పెద్ద ఎత్తున నినాదాలు వినిపించాయి. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ సీతారామాలయంలో పూజలు నిర్వహించిన పెద్దిరెడ్డి, స్థానికుడు కొప్పుల వెంకటకృష్ణ ఇంటి వద్ద గోమాతకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు దేవకీ వాసుదేవరావు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, తడుపునూరి రవీందర్, ఈదుల భద్రం,మండల అధ్యక్షులు దోసపాటి కళ్యాణ్, తొండపు సైదేశ్వరరావు, చింత నిప్పు రామారావు, దుద్దుకూరి కార్తీక్ దొంతుబోయిన నరసింహారావు, నోముల దుర్గ ప్రసాద్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



